

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం రెవ డ్యాన్స్ అకాడమీ గురువు ముఖర్జీ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఇందులో శివపంచాక్షరీ స్తోత్రం, నటేశకౌతం, తీశారా అలరిపు, జతిస్వరం, దేవ దేవం భజే, మురుగవర్ణం, సరస్వతి పుష్పాంజలి, కీర్తనం, కృతి, ధనశ్రీ తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు శాన్వి, షనాయా, సహస్ర తన్వి, సాత్విక, శ్రీకా, వైష్ణవి, వీక్ష, దివ్య, ఓజస్వినీ, నిత్య, మహి, సాంచి, నేత్ర, ఆకాంక్ష తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్యపురంలో నృత్యార్చన

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే నిత్య కార్యక్రమాలలో భాగంగా శనివారం రాగసుధ డ్యాన్స్ అకాడమీ శిష్యబృదం కూచిపూడి నృత్యార్చన చేశారు. విష్ణుసహస్ర నామం, లక్ష్మీ అష్టోత్తరం, అన్నమయ్య అష్టోత్తరం ,అన్నమయ్య గురుస్తుతితో ప్రారంభించారు. రాగసుధ డ్యాన్స్ అకాడమీ గురువు నాగవోలు అనురాధ శిష్యబృందం పుష్పాంజలి, మూషికవాహన, జతిస్వరం, ఒకపరికొకపరి, బ్రహ్మమొక్కటే, నటేశకౌతం తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు వర్ణిక, శ్రీకావ్య, స్వాతి, వర్ష, లేఖ్య, వైష్ణవి, రమ్య, మోక్షజ్ఞ, ఖుషి, కీర్తన, నవ్య, అనిక, అశ్మిత, అక్షిత, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు 'ఏఎస్‌ఎఫ్' విందు



మాదాపూర్: మాదాపూర్‌లోని ఇ గలేరియా మాల్‌లోని ఏఎస్‌ఎఫ్ బార్బెక్యూ గ్రిల్ రెస్టారెంట్ తొలి వార్షికోత్సవంను పురస్కరించుకుని నగరంలోని అనాథ శరణాలయాల విద్యార్థులు, వృద్ధాశ్రమాలలోని వృద్ధులకు విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు సినీనటుడు బెనర్జీ పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

పేరుకే పార్కు..

వినాయక పార్కులో కానరాని అభివృద్ధి



వినాయక పార్కులో ధ్వంసమైన ప్రధాన గేటు, పార్కులో వాహనాలు నిలిపిన దృశ్యం

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీలోని వినాయక పార్కు నిరుపయోగంగా మారింది. గతంలో ఈ పార్కు ప్రహరి గోడ ధ్వంసం కాగా, ప్రధాన గేటును కూడా తొలగించారు. ఇక వాహనాలను ఇష్టానుసారంగా పార్కులో పార్కింగ్ చేస్తున్నారని పత్రికల్లో కథనాలు రాసినప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు పార్కు గేటుకు తాళం వేశారు. పార్కును పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు, చెత్త చెదారం పేరుకుపోయింది. జీహెచ్‌ఎంసీ అధికారులు నగరంలోని పార్కులను అభివృద్ధి చేస్తున్న క్రమంలో వెంకటరమణ కాలనీలోని వినాయక పార్కును కూడా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

- రూ.8 లక్షల నిధులతో పార్కు అభివృద్ధికి ఎమ్మెల్యే గాంధీ రెండు నెలల క్రితం శంకుస్థాపన చేశారు.
- ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి పనులు ప్రారంభించలేదు.
- పార్కు ప్రహరీగోడ, ప్రధాన గేటు ధ్వంసమయ్యాయి
- పార్కులో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలి
- చిన్నారులు ఆడుకోవడానికి కొత్త ఆట వస్తువులు ఏర్పాటు చేయాలి
- పార్కులో పచ్చదనం పెంచాలి.. ఓపెన్‌జిమ్‌ను ఏర్పాటు చేయాలి
- మంచినీటి ట్యాంకును నిర్మించాలి
- పార్కులో వాహనాలు నిలుపకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.



పడిపోయిన ప్రహరీ గోడ

పార్కులో అభివృద్ధి పనులు చేపట్టాలి



పార్కు అభివృద్ధి కోసం రూ.8 లక్షల నిధులు కేటాయించారు. రెండు నెలల గడుస్తున్నా పనులు ప్రారంభం కాలేదు. ప్రహరి గోడ నిర్మించి ప్రధాన గేటును ఏర్పాటు చేయాలి. ఇప్పటికైన అధికారులు స్పందించాలి.

– రాజు, వెంకటరమణకాలనీ

వాహనాలు పార్క్ చేయకుండా చూడాలి



పార్కులో కనీస వసతులు ఏర్పాటు చేసి ప్రజలు సేదతీరేలా పనులు చేపట్టాలి. ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు పార్కు అభివృద్ధికి కృషి చేయాలి.

– శివ శ్రీనివాస్, వెంకటరమణ కాలనీ

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 60, పచ్చిమిర్చి 80, బెండ 60, కాకర 60, దొండ 40, దోస 50, ఆలు 40, చామ 60, కీర 40, బీర 100, వంకాయ 40, గోకర 60, బీన్స్ 140, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 40, క్యారెట్ 70, చిక్కుడు 120, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (1)10 ,క్యాలీ ఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 280.

ట్యాక్స్‌బార్ అసోసియేషన్ పాలకమండలి సభ్యులుగా నారాయణరావు



రాయదుర్గం: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ పాలకమండలి సభ్యులుగా ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ పివినారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నగరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. ఆయన రాయదుర్గంలోని మైహోమ్ భుజలో నివాసముంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో సేవలను అందిస్తున్న సభ్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



గచ్చిబౌలిలోని హిల్‌రిడ్జ్ స్ప్రింగ్స్‌లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

గచ్చిబౌలి: హిల్‌రిడ్జ్ స్ప్రింగ్స్ గేటెడ్ కమ్యూనిటీలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను ఎట్టకేలకు జీహెచ్‌ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ సిబ్బంది శనివారం కూల్చివేశారు. హిల్‌రిడ్జ్ స్ప్రింగ్స్‌లోని 12,13,14 బ్లాక్‌ల చుట్టూ వాకింగ్ ర్యాంప్ కింద అనుమతులు లేకుండా బిల్డర్ నిర్మాణాలు చేపట్టారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని హిల్‌రిడ్జ్ స్ప్రింగ్స్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు గతంలో అనేకసార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఇటీవల మళ్లీ ఫిర్యాదు చేయడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవడంతో సొసైటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

టీబీపై కార్మికులకు అవగాహన

పటాన్‌చెరు టౌన్: టీబీపై ప్రతి ఒకరు అవగాహన కలిగి ఉండాలని టీబీ అలర్ట్ ఇండియా ప్రతినిధి, డిస్టిక్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణ అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ సమీపంలోని హిండ్‌వేర్ లిమిటెడ్ కంపెనీలో టీబీపై కార్మికులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ...టీబీ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు , ఛాతీలో నొప్పి ,శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది , తెమడలో రక్తం పడటం , బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఎవరికైనా కనిపించినట్లయితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

అక్షరాభ్యాసం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ ఇందిరానగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విద్యాభ్యాసం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు మెరుగైన బోధన చేయాలన్నారు.

ఫాదర్స్ డే



గచ్చిబౌలి: తండ్రీ పిల్లల బంధాన్ని బలోపేతం చేసేందుకు కొండాపూర్‌లోని లిటిల్ మిలీనియం స్కూల్‌లో శనివారం ఫాదర్స్ డే వేడుకలు నిర్వహించారు. వినోదభరితమైన ఆటలతో తండ్రులు, పిల్లలు సందడి చేశారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి

మణికొండ: మొక్కలు నాటండి.. చెరువులను రక్షించండి అనే నినాదంతో పెద్ద ఎత్తున మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సయోధ్య స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి మృదుల వేములపాటి, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్‌లు పేర్కొన్నారు. నార్సింగి మున్సిపాలిటీలోని మంచిరేవుల గ్రామంలోని చెరువు చుట్టుపక్కల రెండురోజుల పాటు నిర్వహించనున్న హరితహారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చెరువులు మన జీవనాధారం అని అన్నారు. సంస్థ రాండ్‌స్టాడ్ ఆఫీసర్ సర్వీసెస్ వారి సౌజన్యంతో ఈ కార్యమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇటికిని చెరువు చుట్టూ ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటడం వల్ల చెరువులో నీటి నిల్వ పెరుగుతుందన్నారు. చెట్లు నేల పటుత్వాన్ని, భూసారాన్ని కాపాడతాయన్నారు.

వివాహిత హత్య కేసులో నిందితుడు అరెస్ట్



విజయలక్ష్మి (ఫైల్)



నిందితుడు భరత్‌గౌడ్

రిమాండ్‌కు తరలింపు

హఫీజ్‌పేట్: వివాహిత దారుణహత్యకు అక్రమ సంబంధమే కారణమని చందానగర్ పోలీసులు పేర్కొన్నారు. శనివారం చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ పాలవెల్లి వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లా కొల్చారం మండలం దుంపలకున ఏనుగండ్ల గ్రామానికి చెందిన వై.భరత్‌గౌడ్ అలియాస్ శ్రీను అలియాస్ శ్రీనివాస్ గౌడ్ (39) లింగంపల్లి కానుకుంటలో నివాసముంటూ ఆటో డ్రైవర్‌గా ఉన్నాడు. ఆటో నడిపే సమయంలో శేరిలింగంపల్లి నల్లగండ్ల లక్ష్మీ విహార్ ఫేజ్ 1లో ఉన్న విజయలక్ష్మిని ఆమె పని చేసే అపర్ణ సైబర్ జోన్ వద్ద వదులుతుంటాడు.ఈ క్రమంలో వారి పరిచయం అక్రమ సంబంధంగా మారింది. అలా కొన్ని సంవత్సరాలు సాగింది. ఈ క్రమంలో విజయలక్ష్మి తమ్ముడు సునీల్‌కు డబ్బులు ఇవ్వాలని రూ.10 లక్షలు తీసుకుందన్నారు. ఈ అక్రమ సంబంధం భరత్‌గౌడ్ కుటుంబ సభ్యులకు తెలియడంతో గొడవలు జరిగాయి. అయిన తన ప్రవర్తన మార్చుకోకపోవడంతో భరత్ గౌడ్ భార్య పిల్లలు పుట్టింటికి వెళ్లిపోయారు. విజయలక్ష్మి కూడా అతనిని దూరంగా ఉంచడం మొదలు పెట్టింది. ఇది గమనించిన అతను కొల్లూర్ పోలీస్‌స్టేషన్‌లో వారిపై చీటింగ్ కేసు పెట్టాడు. ఇటీవల సంగారెడ్డి కోర్టులో లోక్ అదాలత్‌లో చీటింగ్ కేసు విత్‌డ్రా చేసుకున్నాడు. అయినా విజయలక్ష్మి తన భర్త వచ్చాడని రావద్దంటూ హెచ్చరించింది. దీంతో తన జీవితం నాశనమైందని భావించిన భరత్‌గౌడ్ మొదట ఆత్మహత్యకు చేసుకోవాలనుకుని తర్వాత ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఈ నెల 14వ తేదీ ఉదయం కట్టర్ బ్లేడ్ కొనుక్కొని మధ్యాహ్నం 1 గంటకు విజయలక్ష్మి ఇంటికి వెళ్ళాడు. అప్పుడే వచ్చిన ఆమెను చెంపపై కొట్టి వెంట తెచ్చుకున్న కట్టర్ బ్లేడ్‌ను గొంతులో పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే కుప్పకూలింది. ఇది చూసిన మృతురాలి చిన్న కుమారుడు కార్తిక్‌ను ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని హెచ్చరించి వెళ్ళిపోయాడు. కాగా మాదాపూర్ డీసీపీ వినీత్, మియాపూర్ ఏసీపీ నర్సింహారావు ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి రక్తం అంటిన షర్టు, కట్టర్ బ్లేడ్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ పాలవెల్లి తెలిపారు. ఈ మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్ట్

మియాపూర్: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ దశరథ్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ హఫీజ్‌పేట మార్తాండనగర్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం ఉదయం మియాపూర్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కాలనీలోని హోలీ ఫాతిమా పాఠశాల సమీపంలో అదే మార్తాండనగర్ కాలనీకి చెందిన ప్రదీప్‌కుమార్ (23),నిజాంపేటకు చెందిన సాయిప్రసన్న(24), చర్లపల్లికి చెందిన శ్రవణ్‌కుమార్(27)లను తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ప్రదీప్ గంజాయిని అరుకు నుండి తీసుకుని వచ్చి స్థానికంగా క్రయవిక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సాయి ప్రసన్న, శ్రవణ్ కుమార్‌లకు గంజాయి అమ్ముతున్నట్లు తెలిపారు. ప్రదీప్‌పై మాదాపూర్, అల్లాపూర్ పోలీస్ స్టేషన్లలో గంజాయి కేసులు నమోదయ్యాయని తెలిపారు. వారి దగ్గర నుండి 300 గ్రాముల గంజాయి, 4 సెల్‌ఫోన్లు, ఓ స్కూటీని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో..

గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు మియాపూర్ పోలీసులు . మియాపూర్ దీప్తీశ్రీనగర్ కాలనీ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు మి యాపూర్ పోలీసులు శనివారం ఉదయం తనిఖీ చేస్తుండగా దీప్తీ శ్రీనగర్ కాలనీకి చెందిన చాకలి నర్సింలు(21)ను తనిఖీ చేయగా అతని వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతనిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా గత కొంతకాలంగా పాపిరెడ్డి కాలనీలోని తేజ అనే వ్యక్తి నుండి గంజాయిని తీసుకు వచ్చి అమ్మకాలు చేస్తున్నట్లు తెలిపాడు. అతని వద్ద నుండి 600 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రమాదాలకు కేరాఫ్ తెల్లాపూర్ సర్కిల్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రానగర్– తెల్లాపూర్ మార్గంలోని రేడియల్ రోడ్డుపై నిర్మించిన సర్కిల్ ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలు అంతగా లేకపోయినా ప్రమాదాలు జరుగుతున్నాయి. విశాలమైన రోడ్డు కావడంతో వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఈ సర్కిల్ వద్ద ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి మృతి చెందిన సంఘటనలు అనేకం ఉన్నాయి. దాంతో అధికారులు సర్కిల్ వద్ద స్పీడ్ బ్రేకర్‌లు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు వెలగడం లేదని ప్రజలు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రేడియల్ రోడ్డు సర్కిల్

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన కాంగ్రెస్ నాయకులు



రాయదుర్గం: విజయవంతంగా విదేశీ పర్యటన ముగించుకొని నగరానికి విచ్చేసిన రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును గచ్చిబౌలి డివిజన్ కాంగ్రెస్ నాయకులు శనివారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని కొండా రవిగౌడ్, ఆవుల ప్రదీప్‌కుమార్‌లు శాలువాలతో సత్కరించారు.

షాపింగ్ కాంప్లెక్స్ పనుల్లో వేగం పెంచాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ యార్డులో 20 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 168 దుకాణ సముదాయం పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం మార్కెటింగ్‌శాఖ అధికారులతో కలిసి మార్కెట్ యార్డులో చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణతో పాటు మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రైతులు, వ్యాపారులు మార్కెట్ యార్డులో క్రయయవిక్రయాలు చేస్తున్నారని అందుకే దుకాణ సముదాయం నిర్మిస్తున్నామని తెలిపారు. కూరగాయలు, ఉల్లితో పాటు మేకలు, గొర్రెల మార్కెట్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కాపాడుకుందాం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెలికుంట చెరువు పరిసర ప్రాంతంలోని చెత్తను శనివారం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ,గ్రీన్ ఆర్మీ అధ్వర్యంలో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గ్రీన్‌ఆర్మీ ప్రతినిధులు మాట్లాడుతూ సేవ్ లేక్– సేవ్ వాటర్ ఉద్యమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. చెరువు పరిసర ప్రాంతాల్లో ఎవరూ చెత్త వేయరాదని కోరారు.

శాంతి కమిటీ సమావేశం

మూసాపేట: పండుగలను శాంతియుతంగా చేసుకోవాలని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం కూకట్‌పల్లి ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్‌లో బక్రీద్ పండుగ సందర్భంగా కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, అల్లాపూర్, బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని మసీదు కమిటి నిర్వాహకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

- ఎమ్మెల్యే గాంధీ
- సాయివైభవ్‌కాలనీలో హరిత వైభవోత్సవం



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గాంధీ, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, కాలనీవాసులు

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో విరివిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు.శనివారం గచ్చిబౌలి డివిజన్‌లోని సాయివైభవ్ కాలనీలో హరిత వైభవోత్సవం కార్యక్రమాన్ని ఆయన మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలు చేసి కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభమైనందున అన్ని చోట్లా మొక్కలు నాటేందుకు అందుకు అందరూ స్వచ్ఛందంగా ముందుకురావాలన్నారు. కాలనీలోని ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన, ఇళ్లలో మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎక్కడ పచ్చదనం ఉంటుందో అక్కడ ఆహ్లాదం ఉంటుందన్నారు.అనంతరం కాలనీ అధ్యక్షురాలు పద్మావతి ఆధ్వర్యంలో పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేష్‌ముదిరాజ్, రమేష్, శ్రీనివాస్, నారాయణ, కాలనీవాసులు సుజిత్‌కృష్ణ, సరస్వతి, సిద్ధార్థ, నవీన్, పవన్, రాజు, సత్యనారాయణ, శర్మ, వేణు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలిని ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం



కార్పొరేటర్ గంగాధర్‌రెడికి వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రతి బస్తీలో మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, గచ్చిబౌలిని ఆదర్శ డివిజన్‌గా చేయాలనే సంకల్పంతో ఉన్నామని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గోపన్‌పల్లిలోని గజానన్ కోఆపరేటివ్ సొసైటీలో శనివారం అవంతిక గోదావరి అపార్ట్‌మెంట్‌వాసులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవంతిక గోదావరి అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తయినతర్వాత సీసీరోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కాలనీలోని సమస్యలను వివరిస్తూ కార్పొరేటర్‌కు వినతిపత్రాన్ని అందించారు. అపార్ట్‌మెంట్‌వాసులు శ్రవణ్‌కుమార్, భానుప్రకాశ్, సందీప్, రామకృష్ణ, నగేష్, కిరణ్, సంపత్, కరుణ, సారంగ పాల్గొన్నారు.

బాలిక మృతిపై వీడని మిస్టరీ

మియాపూర్ : మియాపూర్ నడిగడ్డతండాకు చెందిన బాలిక బానోతు వసంత(13) మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. బాలిక మృతి పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఇంటి దగ్గర అదృశ్యమైన బాలిక సమీప చెట్ల పొదల్లో అనుమానాస్పదస్థితిలో మృతి చెందడం తెలిసిందే. ఈ నెల 7న వసంత అదృశ్యం కావడంతో మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి నరేష్ ఫిర్యాదు చేశాడు. గురువారం రాత్రి నడిగడ్డతండా సమీపంలో చెట్ల పొదల్లో దుర్వాసన రావడంతో స్థానికులు చూసి మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. బాలిక అదృశ్యమైన వారం తర్వాత బస్తీ సమీపంలో చెట్ల పొదల్లో మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో లభ్యం కావడంతో బాలిక మృతి మిస్టరీగా మారింది. బస్తీలో సీసీ కెమెరాలు లేకపోవడం, ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు కాకపోవడంతో బాలిక ఇంటినుండి ఎక్కడికి వెళ్లింది.. ఎవరైన తీసుకువెళ్లారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బాలిక మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో ఈ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. బాలికను హత్యచేశారా..? లేదా కుటుంబ కలహాలతో హత్యచేసి చెట్ల పొదల్లో వేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామ సీఐ దుర్గా రామలింగప్రసాద్ తెలిపారు.

నడిగడ్డతండా వద్ద నిరసన..

బాలిక వసంత కుటుంబానికి న్యాయం చేయాలని మియాపూర్‌లోని నడిగడ్డ తండా వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు తండావాసులు నిరసన తెలిపారు. వసంత ఫొటోలు పట్టుకుని న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేశారు.

గంజాయి పట్టివేత

పటాన్‌చెరు టౌన్: మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 620 గ్రాముల గంజాయిని పట్టుకున్న సంఘటన ఇస్నాపూర్‌లో చోటుచేసుకుంది.ఎక్సై జ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ దుర్గా వైన్ సమీపంలోని తేజ కాలనీ వద్ద ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడని సమాచారం అందుకున్న మెదక్ ఎక్సైజ్ అధికారులు శుక్రవారం రాత్రి ఇస్నాపూర్ చేరుకొని నల్లటి బ్యాగ్ వేసుకుని తిరుగుతున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సాజిద్ ఇక్బాల్‌ను అదుపులో తీసుకొని, బ్యాగ్ లో చూడగా అందులో 620 గ్రాముల ఎండి గంజాయి పట్టుబడింది. పట్టుబడిన గంజాయిని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.